# కన్నీటి కావ్యం

"కొన్ని అక్షరాలు మహావ్యక్తుల కలం పాళీలోంచి అలవోకగా జాలువారి... కావ్యపుటల మధ్య కమనీయంగా వొదిగి... అపురూపత్వాన్ని సంతరించుకొన్నట్టు.

ఈ అవని పత్రం మీద అద్భుతాక్షరాల్లా అలరారుతూ అమరత్వాన్ని పొందేది కొందరే...!!

అలాంటి అరుదైన వ్యక్తుల్లో మన శ్రీనివాసమూర్తి ఒకటైనందుకు అతనిని మనసారా అభినందిస్తున్నాను. పరిశీలించే రాస్తాడో.... పరితపిస్తూ పాత్రలో లీనమై కలం కదిలిస్తాడో...

సెంటిమెంట్‌ని అద్భుతంగా పండించి... బంధాల్ని- అనుబంధాల్ని... తన అక్షరాల్లో అద్వితీయంగా బంధించి... పాఠకుల హృదయాల్ని కదిలించి, కలచి వేసే రచనల్ని సాగిస్తున్న ఈ ప్రముఖ రచయితకి ప్రాణమిత్రుడనైనందుకు గర్విస్తున్నాను..."

అంటూ ఆహుతుల కరతాళధ్వనుల మధ్య రసప్రవాహంలా తన ఉపన్యాసాన్ని కొనసాగించి, తొందరగానే ముగించాడు విశ్వనాథం.

పాతిక సం॥ల క్రితం ఇండియాను వదిలివెళ్ళిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా అమెరికాలో స్థిరపడ్డ విశ్వనాథంలో ఇంకా తెలుగు భాషా పటిమ ఇంతగా నిగూఢమై వుందని ఊహించలేదెవరూ!

మిత్రుడి అభినందనల వెల్లువకి... అదే వేదికని అంతరంగ వారధిగా మలచుకొని... అప్యాయపూరితమైన ఆలింగనంతో... బదులు తీర్చుకున్నాడు శ్రీనివాసమూర్తి.

అసంకల్పితంగా మిత్రులిద్దరి కళ్ళుచెమర్చాయి.

కథా సంకలన ఆవిష్కరణ మహోత్సవం జరుగుతోందక్కడ !...

వివిధ పత్రికల్లో ప్రచురితమైన... సాహితీవేత్తల ప్రశంసలందుకొన్న పలుకథల్ని ఏర్చి కూర్చి... ఒక సంపుటి వెలువర్చడానికి శ్రీకారం చుట్టాడు శ్రీనివాసమూర్తి.

ఒక్కో కథ ఒక్కో ఆణిముత్యమై... మానవ సంబంధాల కమనీయ బాంధవ్యాలు... అన్ని కోణాల్నుండీ స్పృశింపబడ్డా... మూలలూ మాత్రమొక్కటే!... 'అమ్మ' అంతరంగ చింతనలే!!

అందులోని ప్రతీకథా 'అమ్మగుండె' చుట్టూ పరిభ్రమించే వ్యధలకి నిలువెత్తు సాక్ష్యాలే...!!

కన్నపేగు కళ కళ లాడ్డం కోసం...

అన్నీత్యజించి, అణువణువూ ధారపోసి, బిడ్డని గుండెలో పొదువుకొని అల్లారుముద్దుగా లాలించి పెంచితే...

చివరికి ఆ కన్నతల్లి జీవన మలిసంధ్యవేళలో, అమ్మని ఆదరించి అక్కున చేర్చుకోవాల్సింది పోయి... ఎదిగిన బిడ్డలు ఎదమీద తన్ని... ఆమె గుండె గూడునెలా ఛిద్రం చేసి... రెక్కలల్లార్చుకుంటూ ఎగిరి పోతారో...

చాలా ఆర్ద్రతా భరితంగా, కరుణరసాత్మకంగా, కనుల ముందు సాక్షాత్కరింపచేసాడు శ్రీనివాసమూర్తి.

అందుకే చలించి పోయాడు విశ్వనాథం.

అనూహ్యాభావాలెన్నో గుండెలో సుడులు తిరిగి... అంతరంగంలో ఆలోచనలు పరిభ్రమించి పరిమళించాకే-

కళాకారుడి అంతర్మథన లోతుల్లోంచి ఏకళ అయినా ఉవ్వెత్తున ఎగిసిపడి అమృత వాహినై ప్రవహిస్తుంటుంది.

ఏ పాటకి పల్లవైనా...

గుండె గొంతుక మీద రవళిస్తుంది !

ఏ చిత్రానికి ఆకారమైనా...

కుంచె ఆత్మ అంచులోంచి దృశ్యీకరింపబడ్తుంది !!

ఏ రచనకి జీవమైనా...

కలం శ్వాసలోంచి ఊపిరి పోసుకుంటుంది !!!

అలాగే -

కనుపాపలు ఆవిష్కరించే కమనీయదృశ్యమాలికలకి హృదయం స్పందించి మనసు పొరల్ని శృతి చేస్తుంటే...

శ్రీనివాసమూర్తి మనోఫలకం మీద అక్షరాలు ఆర్తిగా అల్లుకుపోయి... అతడి కలం

పాళీలోంచి అద్భుత సాహిత్యం ఒలికేది...!!!

ఒక్కో ఆలోచనా తరంగం... ఒక్కో భావపరిమళమై గుభాళించేది...!!!

పట్టుసడలని విశ్వాసం, అవిరళ కృషి, నిరంతర సాధన... అతడి జీవన పుటలమీద తారాట్లాడి... సాహితీ ప్రపంచంలో అతడికో విశిష్టతని ఆపాదిస్తూ-

రచయితగా అతడి సరికొత్త ఉనికికి ఓ నూతనాధ్యాయాన్ని తెరపించింది.

మరో గంట గడిచాక...

ఆహూతుల మనోఫలకాల మీత ఆవిష్కరింపబడి... ఓ అద్భుత రమణీయ దృశ్య కావ్యమై నిలుస్తూ-

అందరి గుండె పొరల నడుమ తీసి జ్ఞాపకంలా పొదగబడి... ఓ మధురానుభూతిని మిగిలిస్తూ-

సభ శోభాయమానంగా ముగిసింది.

"ఒరేయ్, శ్రీనివాసూ...! నా కార్లో డ్రాప్ చేస్తాగానీ పదరా!" ఆహ్వానించేడు విశ్వనాథం.

అలాగేనంటూ వెళ్ళి అతడి ప్రక్కన కూచున్నాడు శ్రీనివాసమూర్తి. వెంటనే అలవోకగా కదిలిందా మారుతీజెన్.

"ఏంటలా మౌనంగా వుండి పోయావ్!? మనసు విప్పి మాట్లాడరా బాబూ! కొత్త సీరియల్ కేదైనా స్టోరీ లైన్ ఫ్రేమ్ చేసుకుంటున్నావా ఏంటి? అయితే వొద్దులే ! మాట్లాడొద్దు..." కదలకుండా కూర్చొని వున్న శ్రీనివాసుతో అన్నాడు విశ్వనాథం.

బదులుగా, "అదేం లేదు గానీ... అప్పటికీ ఇప్పటికీ ఎలా వుందిరా నా సాహిత్యం?! ఏమైనా మార్పు కన్పిస్తోందా?" అనడిగేడు.

చిర్నవ్వాలికించేడు విశ్వనాథం.

"అమెరికా వెళ్ళాను. బాగా సంపాదించాను. అయితేనేం సముద్రాల విశ్వనాథమంటే ఎంతమందికి తెలుసును? ఎన్ని చేస్తేనేం... ఒక కళాకారుడిని కాగలనా! కీర్తిని సంపాదించగలనా!...

"లక్ష్యం మీద గురి, నిరంతర సాధన, పనిమీద తపన, ఏవ్యక్తినైనా ఆయారంగాల్లో శిఖరాగ్రానికి చేరుస్తుంది."

"కానీ అదృష్టం కూడా తోడవ్వాలిరా! చిన్నప్పటి నుండి నాకూ ఓ గొప్ప చిత్రకారుడ్ని కావాలని వుండేది. అయ్యానా !?"

"సర్లేవోయ్ ! నీ అభిప్రాయం నీది."

"సాహితీవేత్తగా ఆదేవుడు నీకిచ్చిన వరాన్ని చూస్తుంటే అసూయగా వుంది. నిన్ను వరించిన కీర్తికాంతని చూస్తూంటే ఈర్ష్యగానూ వుందిరా!"

"అదంతా నా మీద నీకున్న అభిమానానికి తార్కాణం" అంటూ మిత్రుడివైపోసారి

చూసి-

"ఇంకా ఎన్నాళ్ళుంటావిక్కడ!? మళ్ళీ మీ దేశానికెప్పుడెళ్తున్నావ్...?!" 'మీ' అనే పదాన్ని వొత్తొత్తి పలుకుతూ అడిడేగు శ్రీనివాసమూర్తి.

"మీ దేశమంటూ - రచయిత గారేం వెటకారం వెలిబుచ్చక్కర్లేదు..." అత్తిపత్తిలా మొహం ముడుచుకున్నాడు విశ్వనాథం.

"వెటకారమని కాదు. చిన్నప్పటి నుండీ జన్మభూమి కంటే పరభూమి మీద మక్కువెక్కువ కదా! తమరికి."

"కావొచ్చు. అది గతించిన విషయం. కానీ ఇప్పుడు నా దృక్పథంలోనూ మార్పొచ్చింది. ఒక రచన మనిషినెంత బలంగా ప్రభావితం చేస్తుందో తెలియపర్చడానికి, నేనో నిలువెత్తు ఉదాహరణగా నిలవబోతున్నాను..." అంటూ ఆగేడు.

అర్థం కానట్టు చూసేడు శ్రీనివాసు.

"...నేనిక తిరిగి అమెరికా వెళ్ళదల్చుకోలేదు!!" స్థిరంగా చెప్పేడు విశ్వనాథం. ఒక్క క్షణం నివ్వెర పోయాడు మూర్తి.

ఎందుకంటే మూర్తిలా చంచలుడుకాడు విశ్వనాథం. ఒక నిర్ణయం తీసుకున్నాడూ అంటే ససేమిరా దాన్ని వెనక్కి తీసుకోడు.

"నీవు చెప్పేది...నిజమా!?" నమ్మకం బలపడక విస్మయంగా అడిగేడు.

"ముమ్మాటికీ ! ఆవిష్కరణకి ముందు రోజు నాకిచ్చిన కథా సంపుటిని నిన్ననే చదివేసాను.

అందులోని ఒక కథ-

బతుకు దెరువు కోసమని దుబాయ్ వెళ్ళిన కొడుకు క్షేమాన్నే తలచుకొంటూ ఓ పల్లె తల్లి పడే ఆవేదనకి నాకళ్ళు చెమర్చాయి. అకస్మాత్తుగా ఆ కొడుకు శవమై తిరిగొచ్చినప్పుడు, బిడ్డకోసం తల్లి గోడు గోడున విలపిస్తోంటే... చిన్న పిల్లాడిలా ఏడ్చేసాననుకో !

ఎంత బాగా రాసావని...?!

నాకాక్షణం మా నాన్నా గుర్తుకొచ్చాడు."

అంటూ కారు వేగం తగ్గించి తిరిగి చెప్పసాగేడు...

"అవసానదశలో నా తండ్రిని మనోక్షోభకి గురిచేస్తున్నానేమోనన్పించి ఆత్మపరిశీలన గావించుకున్నాను. నా తల్లి చనిపోయినా మరో స్త్రీకి తావివ్వకుండా నన్ను కంటికి రెప్పలా పెంచిపెద్దచేసిన నాన్న త్యాగం గురించి తలచుకుంటూ రాత్రంతా నా అంతరంగాన్ని మధించు కున్నాను. దాని ఫలితమే ఈ నిర్ణయం." ట్రాన్స్‌లో వున్నవాడిలా ఆర్తిగా చెప్పుకు పోతున్నాడు విశ్వనాథం.

ఎలాంటి భావం తొణికిసలాడకుండా వింటున్నాడు మూర్తి.

"రియల్లీ యూ ఆర్ సోమచ్‌గ్రేట్ మైడియర్ ఫ్రెండ్! ఒరేయ్, నువ్వు నాకిప్పుడో స్నేహితుడిలా కాదు. మార్గదర్శకుడిగా, ఓ మహనీయుడిలా అగుపిస్తున్నావురా... థాంక్స్ ఎలాట్!!

ఆలస్యంగానైనా ఓ సత్యాన్ని గుర్తించేలా చేసావు. ఓ మంచి నిర్ణయం తీసుకోవడానికి కారకుడవయ్యావు. లేకపోతే నా జీవితంలో సరిదిద్దుకోలేని తప్పుచేసిన వాడిగా నిత్యం కుమిలి కుమిలి ఏడ్చేవాడిని.

నా ఈ ఎదుగుదల కోసం తన అణువణువూ ద్రవింపచేసి... అడుగు కందిపోకుండా నన్నల్లారుముద్దుగా పెంచిన నాతండ్రి సాన్నిధ్యంలోనే వుండి... ఆ మహానుభావుడి కడజీవిత మైనా కల్లోలపడకుండా... ప్రశాంతతచేకూరేలా జాగ్రత్తపడ్తాను."

స్టీరింగ్‌ని కుడిచేత్తో హాండిల్ చేస్తూ ఎడం చేత్తో కంటి నీరొత్తుకున్నాడు విశ్వనాథం.

అలా అతను రెప్పమూసి తెరచిన ఆ రెప్పపాటు కాలంలోనే-

దిక్కులు చూసుకోకుండా రోడ్డు దాటుతోన్న వృద్ధురాలొకతె కారుకి అడ్డురావడం... త్రుటిలో ప్రమాదాన్ని తప్పిస్తూ... కారు సడెన్ బ్రేక్‌తో ఆగిపోవడం... ఏకకాలంలో జరిగాయ్!

కారు స్లోగా వెళ్ళక పోతేగనక పెద్ద ఆక్సిడెంట్ జరిగి వుండేది.

గ్లాస్ విండోలోంచి బయటకు చూస్తున్నాడు మూర్తి. కారు కుదుపుకి బ్యాలెన్స్ తప్పి ముందుకు తూలాడు. అతడి నుదురు మూసివున్న గ్లాస్ విండోకి బలంగా తాకింది.

అసంకల్పితంగా "అమ్...మ్మా!!" అనే స్వరం సన్నని మూలుగై... అతడి గొంతు మూలల్లోంచి వెలువడింది.

తాకిన ఆ చిన్న దెబ్బకే ఉవ్వెత్తున లేచిన కోపంతో, డోర్ తీసి చివాల్న దిగి-

"ఏయ్, ముసలి పీనుగా! కళ్ళు కనబడ్డంలేవూ?!... చావడానికి ఈ కారే దొరికిందే నీకు...??" అంటూ తీవ్రంగా అరిచేడు మూర్తి.

"ముసల్దాన్ని... చూసుకోలేదు బాబూ!!" అంటూ కిందపడి పోయిందల్లా వయోభారంతో నెమ్మదిగా లేచి మూర్తి వైపు తిరిగిందావిడ.

సముద్ర ఘోషలోంచి ఎగిసిపడిన ఏ కల్లోలిత కెరటం రెక్కలు సాచి గుండెల్ని ఒడిసి పట్టుకుందో...?!

ఊపిరాడని ఊపిరితిత్తుల్లా... స్తంభించి పోయారిద్దరూ...!!

ఊహించని ఈ సంఘటనకి బెదిరిపోయిన ఆ వృద్ధురాలు గజ గజా వణుకుతూ అందికదా-

"త... తప్పయి పోయింది బాబూ! నీ భార్య మాటలు విని ఇంట్లోంచి గెంటేసావు. ఈ ఊర్లోనే నా నీడ కూడా కన్పించకూడదని నీ భార్య శాసించింది.

పండుటాకుని. మీ నాన్నతో ముడిపడిన జీవితం ఈ 'జగిత్యాల' లోనే రాలిపోవాలన్న స్వార్థం నన్నిక్కడే వుంచేసింది. చాటుమాటుగానైనా కన్నపేగుని కనులారా చూసుకోవచ్చనే

మమకారం నన్నీ ఊరు వదలకుండా చేసింది బాబూ...!

మళ్ళీ ఈ సారి ఎవరికంట పడకుండా పోతాను బాబూ!! మీ నుండి దూరంగా వెళ్ళిపోతాను..." అంటూ వర్షిస్తోన్న అశ్రుకణాన్ని కంట్లోనే అదిమిపడ్తూ, ఆయాసంతోనే వడివడిగా ముందుకి సాగిపోయిందావిడ.

అచేతనుడై వాళ్ళ సంభాషణ వింటోన్న విశ్వనాథం నిరుత్తరుడయ్యాడు. అతనా షాక్ నుండి తేరుకొని, ఓ ప్రక్కగా కారాపి, మూర్తి చెంతకు పరుగెత్తాడు. అతనీ విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నాడు.

"ఒరేయ్! అమ్మ... అమ్మింకా బ్రతికే వుందా...?!?

చ...చ్చి...పో...యిం...ద...ని... చెప్పేవు కదరా !!??" భుజాల్ని పట్టికుదుపుతూ ఆవేశంగా అడిగేడు విశ్వనాథం.

"అ...అ...అదీ..." అంటూ జవాబు చెప్పలేక తడబడుతూ-

వెన్నెలని దాచేసుకొని మొహం చాటేసుకున్న అమావాస్య చంద్రుడిలా... చప్పున తలొంచుకున్నాడు మూర్తి.

ఉద్వేగాన్ని అణచుకొంటూ, "కనీసం అమ్మవెళ్తోంటే, ఆపకుండా, అలా నిలబడ్డావేంరా??" అరిచేడు విశ్వనాథం.

శ్రీనివాసమూర్తి పెదవి విప్పనూ లేదు. తలెత్తనూ లేదు.

తల్లిని అతడాపే ప్రయత్నం చేయకపోవడంతో విశ్వనాథం కోపంతో వూగిపోతూ-

"భేష్ ! మూర్తి...భేష్ !! నీవింత వరకూ గొప్పసాహితీవేత్తవేననుకున్నాను. బట్... గొప్పనటుడివి కూడావని ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది. సాహితీ వేత్తగా నీవెన్ని నీరాజనాలందు కుంటేనేం?... మేడిపండు చందంలా నీ అంతరంగ మంతా కుళ్ళుతో నిండాక...!!

జన్మనిచ్చిన తల్లినే ఇంట్లోంచి వెళ్ళగొట్టావు. తల్లి బ్రతుకుని క్షణ క్షణం నరకతుల్యం చేసే నీలాంటి వ్యక్తులకంటే... ఒకేసారిగా గొంతు పిసికి చంపే కిరాతకులయిన కొడుకులే నయం!" అంటూ క్షణం ఆగేడు.

"నేను తండ్రిని ఒంటరిని చేసి ఉద్యోగరీత్యా ఇంట్లోంచి వెళ్ళానేమోగానీ నీలా మమకారం మరిచి కన్నతండ్రిని మాత్రం బయటకు వెళ్ళగొట్టలేదు. కళాకారుడిగా జన్మించడం పూర్వజన్మ సుకృతం కావొచ్చు. కానీ కన్న తల్లిదండ్రుల సేవచేసుకొనే భాగ్యం లభించడం మాత్రం... జన్మ జన్మల సుకృతంరా !

కథల్లో కరుణరసాన్ని వొలికించడం కాదు. హృదిలో వాత్సల్యాన్ని పలికించుకో ! పాత్రల్ని సృష్టించడమే కాని పాత్రల్లో అనుభూతి లేనివాడివి... నీకెందుకురా ఈ సాహిత్యపు ముసుగు...?! వెళ్ళు...వెళ్ళి తగలబెట్టుకో నీ సాహిత్యాన్ని...!!

నీవు నా ఫ్రెండ్‌వని చెప్పుకోవడానికే సిగ్గుచేటుగా వుంది." అంటూ అక్కడి నుండి నిష్క్రమించబోతూ వెనుదిరిగి-

"మమకారం కురిపించే మనసుపొరల్ని కౌగిలాలుగా పరచి... ప్రేమాభిమానాలు నిండిన గుండెని కలంలా మలచుకొని... అప్యాయతానురాగాల అక్షరాల్ని అల్లడం నేర్చుకో! గుడ్ బై." అంటూ విసవిసా అక్కడి నుండి కదిలి కారు స్టార్ట్ చేసుకొని, వెనుదిరిగి వెళ్ళిపోయేడు విశ్వనాథం.

ఏ బాల్యస్మృతి మనసుకి గుర్తొచ్చి గుండెని పెకిలించిందో...?! అంతరంగ మథనానంతరం కనువిప్పే కలిగిందో...?!

"అమ్మా !... నన్ను క్షమింపమ్మా !!" అని వెర్రిగా అరుస్తూ, బాహ్యప్రపంచాన్ని మరచి తన తల్లి వెళ్ళిన దిశగా పరుగులంకించుకున్నాడు శ్రీనివాసమూర్తి.

పశ్చాత్తాపం ఎదని పిండేస్తోంటే-

స్పందించిన కళ్ళలోంచి జలపాతంలా కన్నీరొలుకుతోంది... ఆ మాతృమూర్తి పాదాలను కడిగేసి ప్రక్షాలనం గావించుకోవడానికి...!!!

కనుపాపలకి అడ్డుపడ్తోన్న కన్నీటి పొరలు... దారిని మసక బారుస్తున్నా లెక్కచేయక... సంధించి వదిలిన బాణంలా వేగం పెంచేడు.

కాసేపట్లోనే అల్లంత దూరంలో... వెళ్తోన్న తల్లి జాడ అగుపించింది.

కొడుకు క్షేమాన్ని కోరిందో... తన జీవితానికి ముగింపునే ఆశించిందో... కొడుకు తనని వెతుక్కుంటూ రావడం గమనించిన ఆ అభాగ్యురాలు-

రైలు కూతై వస్తోన్న మృత్యువు ఆగమనాన్ని పసిగట్టలేక పోయింది.!!!

కొడుకు నుండి మరింత దూరమవ్వాలనే ఆలోచనతో... పట్టాలు దాటి...క్షణంలో కనుమరుగవ్వాలనుకొంది. కానీ అడుగులు తడబడ్డాయి. తనువు తూలిపడింది.

"అమ్మా!.. ఈ పాపిని క్షమించమ్మా!!" అంటూ ఆత్మప్రక్షాళనతో విలపిస్తోన్న తనయుడి ఆక్రందన ఆ అనురాగ దేవత చెవిన పడనేలేదు.

తనయుడి నిరాదరణకి గురైన తల్లికి నిలువెత్తు సాక్ష్యంలా ఆమె శరీరం రైలు కిందపడి-

తు...నా...తు...న...క...ల...య్యిం...ది !!!

ఆ అనూహ్యదృశ్యాన్ని ఆవిష్కరించుకోలేక, అశ్రుకణాల్ని జారవిడుస్తోన్న కనుపాపలపై కనురెప్పలు జాలిగా తన రెక్కలు కప్పడంతో నిల్చున్న చోటే నిలువునా కుప్పకూలి పోయాడతను...!!

"అమ్మ్...మ్మా!" అనే స్వరం తొలిసారిగా ఓంకార నాదమై అతడి గుండె గదిలో ప్రతిధ్వనించింది.

"అమ్మా...!...అమ్మా...!!" అంటూ అలమటిస్తూనే వున్నాడు.

ఆ మహానుభావురాలు తుది శ్వాస విడిచే చివరి క్షణాన నడచిన పవిత్రమైన నేలని

ఆర్తిగా తడుముతూ...

అస్పష్టంగా పడిన ఆమె పాదాలముద్రలపై ప్రణమిల్లి, కన్నీటితో అభిషేకిస్తూ, కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నాడు శ్రీనివాసమూర్తి.

ఇప్పుడిప్పుడే...

"అమ్మా...!!" అనే మధురాక్షరాలకి సరైన నిర్వచనాన్ని... హృది ఫలకంపై దిద్దుకుంటున్న... పసివాడిలా...!!!